07082024-MAI-04_Layout 1 8/7/2024 2:11 AM Page 1

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

నమస్తే తెలంగాణ

ఈ నగరానికి ఏమైంది?

రాజధాని నగరం హైదరాబాద్ రోజురోజుకూ అరాచకంలో కూరుకుపోతున్నది. నేరాలు, ఘోరాలు నిత్యకృత్యంగా మారిపోతున్నాయి. గంగా జమునా తెహజీబ్‌కు పేరుగాంచిన 'చార్‌సా సాల్ షహర్'లో యథేచ్ఛగా జరుగుతున్న అత్యాచారాలు, హత్యలు పోలీసుల అస్తిత్వాన్నే ప్రశ్నార్థకం చేస్తున్నాయి. గత వారం, పది రోజుల్లో జరిగిన ఘటనలను పరిశీలిస్తే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో అర్థమవుతుంది. చిన్నారులపై లైంగికదాడులు, అపహరణల వార్తలు నిత్యం మీడియాలో కనిపిస్తున్నాయి. నిర్దోషులను కాపాడి, నేరస్థులను శిక్షించడంలో పోలీసుల అలసత్వం, కొన్ని సందర్భాల్లో మిలాఖత్ కావడం చూస్తుంటే ఆందోళన కలిగిస్తున్నది. మరోవైపు పోలీసు జులుం రెచ్చిపోవడం చూస్తుంటే అసలు ప్రభుత్వమనేది ఉన్నదా? అనే సందేహం కలుగుతున్నది. జూలైలో మహిళలపై ఒక్కరోజే మూడు అత్యాచార ఘటనలు నమోదయ్యాయి. అందులో ఒకటి నిర్భయ తరహా నేరం కావడం సురక్షిత నగరంగా పేరొందిన నగరం ఎంతగా దిగజారిపోతున్నదో తెలుస్తున్నది. గ్రేటర్‌లో గత ఏడు నెలల్లో అత్యాచార ఘటనలు వందల సంఖ్యలో జరిగాయి. ఇందులో పోక్సో కేసులు 850 వరకు నమోదయ్యాయి. చిన్నారులు, మైనర్లపై కూడా లైంగికదాడులు పెరిగాయి. ఇదే 7 నెలల వ్యవధిలో 160కు పైగా హత్యలు జరిగాయి. రౌడీ షీటర్ల గ్యాంగ్‌వార్లు, ప్రతీకార హత్యలతో నగరం అట్టుడుకుతున్నది.

సుమారు దశాబ్దకాలం పాటు సుస్థిరమైన శాంతిభద్రతలు నెలకొన్న హైదరాబాద్‌లో 8 నెలల్లో పరిస్థితి తారుమారైంది. సొంత రాష్ట్రం ఏర్పాటు కాగానే అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం మొదటగా దృష్టి కేంద్రీకరించింది పోలీసు వ్యవస్థను మెరుగుపరచడంపైనే. ముఖ్యంగా మహిళల భద్రతకు హాక్ ఐ, షీ టీమ్స్ వంటి వినూత్న వ్యవస్థలను అమల్లోకి తెచ్చింది. నేరాల అదుపునకు కేంద్రీకృత నిఘా వ్యవస్థను ప్రవేశపెట్టింది. శాంతిభద్రతలు సవ్యంగా ఉంటేనే అభివృద్ధి సాధ్యమనే ఆలోచన దీనంతటికీ కారణం. కానీ, ఇప్పుడు అంతా మొదటికొచ్చింది. 'ఫ్రెండ్లీ' పోలీసులు పౌరులను శత్రువులుగా చూస్తున్నారు. లాఠీ ఝుళిపించి ప్రతాపం చూపిస్తున్నారు. షాద్‌నగర్‌లో ఓ దొంగతనం కేసులో దళిత మహిళపై థర్డ్ డిగ్రీ ప్రయోగించడం, కొడుకు ముందే వివస్త్రను చేసి చిత్రహింసలు పెట్టడం సభ్యసమాజాన్ని తలదించుకునేలా చేసింది. ఈ కేసులో పోలీసుల పాత్రపైనే అనుమానాలు తలెత్తడం గమనార్హం. చోరీ సొత్తులో వాటా కోసమే పోలీసులు అత్యుత్సాహం చూపినట్టు ఆరోపణలు రావడం తెలిసిందే. ఈ ఉదంతం పోలీసుల బరితెగింపునకు అద్దం పడుతున్నది. ఓవైపు ఇలా నిర్దోషులు వేధింపులకు గురవుతుంటే మరోవైపు ఓ పోలీసు స్టేషన్ నుంచి ఒక దొంగ వారంలో రెండుసార్లు తప్పించుకోవడం పోలీసుల అసమర్థతకు నిదర్శనం.

పోలీసులంటే వృత్తిపరమైన నైపుణ్యంతో దర్యాప్తు జరిపి న్యాయం చేస్తారనే భరోసా తగ్గిపోతున్నది. ఈ తరహా ఘటనలన్నీ కూడా ప్రభుత్వ పర్యవేక్షణలోని లోపాలను వేలెత్తి చూపుతున్నాయి. ప్రజలకు భద్రత విషయంలో భరోసా కల్పించేందుకు ప్రభుత్వం తన ప్రాధాన్యాలను సమీక్షించుకోవాల్సి ఉన్నది. పోలీసు యంత్రాంగాన్ని కట్టుదిట్టం చేసి భద్రతకు మళ్లీ భరోసా కల్పించాలి.

రుణమాఫీ కాని రైతుల పక్షాన..

'ముందు దగా, వెనుక దగా, కుడి ఎడమల దగా దగా!' అనుభవిస్తున్న శ్రామికవర్గం మన రైతాంగం. రైతులకు పెట్టుబడి కూడా దక్కని వారి పంట మాత్రం మార్కెట్‌లో దళారులకు సిరుల పంట పండిస్తున్నది. సంచెడు కూరగాయలకు పది రూపాయలు గిట్టనిది బజార్లో కిలోకు వందవుతుంది. నాసిరకం విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులతో వ్యాపారులు రైతును నిలువు దోపిడీ చేస్తున్నారు. వీటి బారి నుంచి రైతన్నను కాపాడలేని అశక్త ప్రభుత్వాలు రాయితీల కంటితుడుపుతో బుజ్జగిస్తున్నాయి.

బి.నర్సన్
94401 28169

ఆ ఓదార్పునకు కూడా గండి కొడితే రైతు బాధ వినేదెవరు? లేస్తే చేను చెలకల్లో పొద్దు గడిపేవారికి లోకం పోకడలు తెలియవు. సంఘాలు, ఆందోళనలు తెలియవు. రోడ్డెక్కి న్యాయాన్ని అడిగే తీరు తెలియదు. కాంగ్రెస్ ప్రభుత్వం మాఫీ చేస్తామని చెప్పిన పంట రుణం సొమ్ము బ్యాంకు ఖాతాలో పడకున్నా దిక్కుతోచని స్థితిలో బెంగ పడుతున్నారు. జవాబు చెప్పే నాథుడు లేక చేష్టలుడిగి కూచున్నారు. రుణమాఫీ అయిపోయింది కదా అన్నట్టే చేతులు దులుపుకొన్నా పాత లెక్కలు ముందేసి ప్రభుత్వాన్ని నిలదీసేవారు కరువయ్యారు.

నేను ఈ మధ్య ఇదే అంశంపై రాసిన వ్యాసాలను చూసిన రైతులు పదుల సంఖ్యలో తమ గోడును వెళ్లబుచ్చుకున్నారు. 'మా అమ్మకు డిపెండెంట్ పింఛన్ వస్తుంది. రేషన్‌కార్డులో ఆమెతో పాటు మా పేరున్నది. పంట అప్పు మాఫీ కాలేదు. ఆమెను అడుక్కోవాలా?' ఒక రైతు అన్నాడు. 'నాకు పెండ్లయినా మా ఇంటి రేషన్ కార్డులోనే నా పేరున్నది. మా ఆయనకు భూమి లేదు. మా తల్లిగారిచ్చిన భూమిపై లోను తీసుకున్నాను. మాఫీ కాలేదు' అని ఓ ఆడబిడ్డ బాధపడింది. ఇలాంటి ఉదంతాలెన్నో ఉంటాయి. అందరికీ పంట రుణం మాఫీ చేస్తామని గద్దెనెక్కిన కాంగ్రెస్.. పొంతనలేని కిసాన్ సమ్మాన్ నిబంధనలను తెచ్చి మా కొంప ముంచడమేమిటని రాష్ట్ర రైతాంగం కుమిలిపోతున్నది.

అయితే, దీన్ని ఇలాగే వదిలేయాలా లేక ఇదేం అన్యాయమని ప్రభుత్వాన్ని ప్రశ్నించాలా అనేది ఇప్పుడు మన ముందున్న ప్రశ్న. 2014లో బీఆర్ఎస్ ప్రభుత్వం 35 లక్షల రైతు ఖాతాల్లో రూ.16,144 కోట్లను జమ చేసింది. అదేవిధంగా 2018లో 36.68 లక్షల రైతులకు లక్షలోపు రుణమాఫీ కోసం రూ.19,198 కోట్లు బ్యాంకులకు చెల్లించింది. కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష లోపు రైతు రుణమాఫీగా కేవలం 11.5 లక్షల రైతుల కోసం రూ.6,098 కోట్లు బ్యాంకుల్లో జమచేసింది. లక్షన్నర అప్పు మాఫీ కోసం రూ.6,190 కోట్లు విడుదల చేసింది. బ్యాంకుల లెక్కల ప్రకారమైతే ఈ ఏడాది మార్చి నాటికి పంట రుణాల మొత్తం రూ.64,940 కోట్లు ఉన్నట్లు తెలుస్తున్నది. ప్రభుత్వం నిర్ణయించిన కటాఫ్ తేదీ 2023, డిసెంబర్ 9 వరకు తీసుకున్నా రూ.49,500 కోట్లు తెలంగాణ రైతులు బ్యాంకుల్లో చెల్లించాలి. ఇందులో అగ్రిగోల్డ్ లోన్లు తీసేస్తే కనీసం రూ.39,000 కోట్లయినా అసలైన పంట రుణాలు ఉండే అవకాశం ఉన్నది. మొదట ప్రభుత్వం కూడా ఇదే మాటన్నది. క్రమంగా మాఫీ మొత్తం తగ్గుతూ వచ్చింది. మూడు విడతల రుణమాఫీలో లబ్ధి కుటుంబాల సంఖ్య 35,49,870 కాగా, వారికి మాఫీ చేస్తున్న సొమ్ము రూ.24,449 కోట్లు అని వ్యవసాయశాఖ ఈ నెల 1న తేల్చింది. అంటే రుణ మాఫీ సినిమాకు శుభం కార్డు పడ్డట్టే.

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఈ విషయంపై స్పందిస్తూ రుణమాఫీపై ప్రభుత్వం విధించి న నిబంధనల కారణంగా 70 శాతం రైతులకు మాత్రమే మాఫీ వర్తించిందని, దీనిపై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని కోరారు. నష్టపోయిన అన్నదాతలు తమ కష్టాలు చెప్పుకోవడానికి ఒక మొబైల్ నెంబర్ కూడా తెలిపారు. అయితే ఎన్నిసార్లు కాల్ చేసినా ఆ నెంబర్ బిజీ వస్తున్నది. అందులో ఏదో మతలబు ఉండొచ్చు. కొత్త రైతు చట్టాలతో దేశంలోని రైతులను, వారి పంటలను, భూములను బడా పారిశ్రామికవేత్తలకు ధారాదత్తం చేయడానికి సిద్ధపడి, భంగపడిన బీజేపీ మన రైతులకు మేలు చేస్తుందని ఆశించలేం. బీఆర్ఎస్ నేతలు మాఫీ తొలి ప్రకటన నుంచే మాఫీ తప్పుల తడక అంటూ, మాఫీ అందని రైతుల గొంతును వినిపిస్తున్నారు. రైతు సంఘాలు, వేదికలు ప్రభుత్వ చర్యను ఖండించడం తప్ప ఎలాంటి కార్యాచరణను చేపట్టినట్టు లేదు. ఒక్క అసెంబ్లీ సీటుతో సీపీఐ మురిసిపోతూ రైతు బాధలను పట్టించుకోకుండా కాంగ్రెస్ వెంట తోకాడిస్తూ తిరుగుతున్నది.

నిజానికి రుణమాఫీ అనేదానికి లక్ష పరిమితి చాలు. ఆపై అప్పు తీసుకునేవారికి కొంత మెరుగైన ఆర్థిక పరిస్థితే ఉంటుంది. అందుకోసం రూ.లక్ష రుణమాఫీ కోసమైనా పీఎం కిసాన్ నిబంధనలను సడలించి, తెల్ల రేషన్ కార్డు అర్హతను తొలగించాలి. రూ.నలభై, యాభై వేల అప్పు ఉన్నవాళ్లకు కూడా ఈ నిబంధనల వల్ల మాఫీ వర్తించకపోవడం శోచనీయం.

అంతా అయిపోయింది అన్నట్టు ప్రవర్తిస్తున్న ప్రభుత్వాన్ని మీ హామీ ఏమిటి, ఈ నిబంధనలు ఏమిటి? అని అడిగేవారు కావాలి. 2014, 2018లో మాఫీ లభించిన వారిలో ఈసారి మాఫీ వర్తించని వారెందరో గ్రామాలవారీగా సమాచారం సేకరించాలి.

రైతు బృందాలతో కలిసి విపక్షాలు ఆయా ప్రాంతాల్లోని ఎమ్మెల్యేలు, మంత్రుల వద్దకు వెళ్లి రాతపూర్వక నివేదనలివ్వాలి. మాఫీ సాధన సమితిని ఏర్పాటుచేసి రైతుల పక్షాన నిలబడాలి. రూ.2 లక్షల దాకా రుణమాఫీ ఇస్తున్నందువల్ల నిధుల కొరతతో ఈ నిబంధనలు పెట్టవలసి వచ్చిందని ప్రభుత్వం నోట అనిపించాలి.

నిజానికి రుణమాఫీ అనేదానికి లక్ష పరిమితి చాలు. ఆపై అప్పు తీసుకునేవారికి కొంత మెరుగైన ఆర్థిక పరిస్థితే ఉంటుంది. అందుకోసం రూ.లక్ష రుణమాఫీ కోసమైనా పీఎం కిసాన్ నిబంధనలను సడలించి, తెల్ల రేషన్ కార్డు అర్హతను తొలగించాలి. నలభై, యాభై వేల రూపాయల అప్పు ఉన్నవాళ్లకు కూడా ఈ నిబంధనల వల్ల మాఫీ వర్తించకపోవడం శోచనీయం. తక్కువ రుణ పరిమితినో, భూ పరిమితినో దృష్టిలో పెట్టుకొని చిన్న, సన్నకారు రైతులకైనా ప్రభుత్వం మాఫీ వర్తింపజేస్తే ఆ లక్ష్యం నిజంగా నెరవేరినట్టవుతుంది.

తెలుగు యూనివర్సిటీకి సురవరం పేరు పెట్టాలె!

ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి గారికి...

2024, జూన్ 2 నాటికి తెలంగాణ రాష్ట్రం ఏర్పాటై పదేండ్లు పూర్తయ్యాయి. అదే సమయంలో పునర్విభజన చట్టంలోని హైదరాబాద్ ఉమ్మడి రాజధాని అనే నిబంధన తొలగిపోయింది. దీంతో హైదరాబాద్‌పై సర్వహక్కులు తెలంగాణకు దఖలు పడ్డాయి. ఈ సందర్భంగా ప్రస్తుతం హైదరాబాద్‌లో ఉన్నటువంటి పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయానికి తెలుగు వైతాళికుడు 'సురవరం ప్రతాపరెడ్డి' పేరు పెట్టినట్టయితే అది తెలంగాణ ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేయడానికి తోడ్పడుతుంది.

'అన్నిపక్షాలు కోరుకున్నట్టయితే సురవరం పేరును తెలుగు విశ్వవిద్యాలయానికి పెట్టడానికి ప్రభుత్వానికి ఎలాంటి అభ్యంతరం లేద'ని 2024 ఆగస్టు 2న ముగిసిన అసెంబ్లీ సమావేశాల్లో మీరు తెలిపినందుకు ధన్యవాదాలు. ఈ పేరు మార్పు ప్రతిపాదనను సీపీఐ శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు చేశారు. వారికీ ధన్యవాదాలు. అట్లాగే ఈ ప్రతిపాదనకు మద్దతు పలికిన బీఆర్ఎస్ నాయకులు, మాజీ మంత్రి కల్వకుంట్ల తారకరామారావుకు కూడా ధన్యవాదాలు. బీజేపీ సైతం ఈ విషయంలో సానుకూలంగా ఉన్నది. వీటన్నింటిని దృష్టిలో పెట్టుకొని సాధ్యమైనంత త్వరలో పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయం పేరును 'సురవరం ప్రతాపరెడ్డి విశ్వవిద్యాలయం'గా మార్చాలని కవులు, రచయితలు, తెలంగాణ వాదులుగా మేమందరం మరొక్కమారు మీకు విజ్ఞప్తి చేస్తున్నాం. తెలంగాణ సాహిత్యం, కళలు, కళారూపాలు, వారసత్వ సంపదను కాపాడుకునేందుకు, ఉన్నతస్థాయి పరిశోధనకు ఇది అత్యావశ్యకం.

తెలంగాణ ప్రజల ఔన్నత్యాన్ని, ప్రతిభను దశదిశలా వ్యాపింపజేసిన దార్శనికుడు, నడుస్తున్న విజ్ఞాన సర్వస్వం సురవరం ప్రతాపరెడ్డి. విరామమెరుగకుండా మూడు దశాబ్దాల పాటు ప్రతిరోజు రచయితగా, జర్నలిస్టుగా తాను సృజించిన రచనలన్నీ ఆణిముత్యాలే. మద్రాసులో వేదము వెంకటరాయశాస్త్రి వద్ద ఆయన విద్యాభ్యాసం చేశారు. తెలుగు సాహిత్యంలో పండితునిగా ఎదిగిన సురవరం ప్రతాపరెడ్డి న్యాయశాస్త్రాన్ని కూడా చదివారు. రెడ్డి హాస్టల్ నిర్మాతగా విద్యావ్యాప్తికి తోడ్పడ్డారు. గోలకొండ పత్రిక స్థాపక సంపాదకులుగా, ఆంధ్రమహాసభ తొలి అధ్యక్షుడిగా, గ్రంథాలయోద్యమ నాయకుడిగా, పౌరహక్కుల ఉద్యమకారుడిగా, రచయితగా, పరిశోధకుడిగా, గ్రంథమాల నిర్వాహకుడిగా, సారస్వత పరిషత్తు స్థాపకుల్లో ఒకరిగా, ఆంధ్ర విద్యాలయ నిర్మాతగా, ప్రచురణకర్తగా, తెలంగాణ అస్తిత్వ పతాకం 'గోలకొండ కవుల సంచిక' సంపాదకులుగా, ఆంధ్రుల సాంఘిక చరిత్రను నిర్మించిన చరిత్రకారుడిగా, అరుంధతీయ సంఘానికి గౌరవ అధ్యక్షుడిగా వ్యవహరించిన సామాజిక సంస్కర్త సురవరం. ఇట్లా బహుముఖాలుగా తెలంగాణ సమాజాన్ని చైతన్యపరిచిన సురవరం ప్రతాపరెడ్డి పేరు తెలుగు విశ్వవిద్యాలయానికి పెట్టడం చాలా సమంజసనీయమైన నిర్ణయం.

ముఖ్యమంత్రిగా మీరు ప్రస్తుతం ప్రాతినిధ్యం వహిస్తున్న ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందినవాడే కాకుండా హైదరాబాద్ రాష్ట్ర తొలి అసెంబ్లీ లో వనపర్తి నియోజకవర్గం నుంచి శాసనసభకు సురవరం ప్రతాపరెడ్డి ప్రాతినిధ్యం వహించారు. అట్లాంటి బహుముఖ ప్రజ్ఞాశాలిని శాశ్వతంగా చరిత్రపుటల్లోకి ఎక్కించేవిధంగా తెలుగు విశ్వవిద్యాలయానికి సురవరం పేరు పెట్టాలి. అంతేకాకుండా కాళోజీ, దాశరథిల మాదిరిగానే 'సురవరం' పేరిట కూడా ఏటా ఉత్తమ పత్రికా సంపాదకులు/ జర్నలిస్టులు, చరిత్రకారులు, సాహితీవేత్త, సామాజిక సంస్కర్త/ హక్కుల కార్యకర్తలకు అవార్డు ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కవులు, రచయితలుగా రాష్ట్ర ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేస్తున్నాం.

ఇట్లు

డాక్టర్ నాశేశ్వరం శంకరం, ఆనందాచారి, రంగన్న, వనపట్ల సుబ్బయ్య, డాక్టర్ సంగిశెట్టి శ్రీనివాస్, డాక్టర్ పసునూరి రవీందర్, మువ్వా శ్రీనివాసరావు, డాక్టర్ భీంపల్లి శ్రీకాంత్, ఘనపురం దేవేందర్, దేశపతి శ్రీనివాస్, స్కైబాబ, డాక్టర్ పల్లెర్ల వీరస్వామి, వర్జుల శివకుమార్, కొల్లాపురం విమల, కందుకూరి శ్రీరాములు, ముచ్చర్ల దినకర్, డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి, బండారు శంకర్, గుడిపల్లి నిరంజన్, బోలా యాదయ్య, పలుస శంకర్‌గౌడ్, రావూరి వనజ, జ్వలిత, అనిశెట్టి రజిత, డాక్టర్ అంబటి భానుప్రకాశ్, ఇల్లూరి వెంకట్రామయ్య శెట్టి, డాక్టర్ వేణు సంకోజు, ఒద్దిరాజు ప్రవీణ్‌కుమార్, డాక్టర్ రాయారావు సూర్యప్రకాశ్‌రావు, తులసి వెంకటరమణాచార్యులు, జయహన్మంత్ నాయక్, డాక్టర్ సుంకిరెడ్డి నారాయణరెడ్డి, డాక్టర్ నలిమెల భాస్కర్, అన్నవరం దేవేందర్, ఉదారి నారాయణ, వల్లభాపురం జనార్దన, కె.లక్ష్మణ్‌గౌడ్, కోట్ల వెంకటేశ్వరరెడ్డి, వేముగంటి మురళి, ఎదిరెపల్లి కాశన్న,
డాక్టర్ సీతామహాలక్ష్మి
తదితరులు.

నాటి హుందాతనం కనిపించదేమి?

పదేండ్ల పాటు హుందాతనానికి మారుపేరుగా నిలిచిన రాష్ట్ర శాసనసభ మొన్నటి బడ్జెట్ సెషన్ జరిగిన తీరును చూసి యావత్ తెలంగాణ నివ్వెరబోయింది. సాక్షాత్తూ సభా నాయకుడే వెకిలి చేష్టలతో, కురచ మాటలతో తెలంగాణ అసెంబ్లీ ప్రతిష్టను దిగజార్చగా, ఉప ముఖ్యమంత్రి, మంత్రులు, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు సభా మర్యాదను మంటగలిపారు.

దిలీప్ కొణతం

నిజానికి పదేండ్ల తర్వాత ప్రజలు దయతలిస్తే బొటాబొటి ఓట్లతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌కు ఇచ్చిన మాటను నిలబెట్టుకుని తెలంగాణ ప్రజలకు దగ్గరయ్యే అవకాశం గత ఏడెనిమిది నెలలుగా ఉండింది. దశాబ్ద కాలంలో కేసీఆర్ ప్రభుత్వం చేసిన మంచిపనులను కొనసాగిస్తూ, ఏదైనా లోటుపాట్లు జరిగి ఉంటే వాటిని సరిదిద్దుతూ.. నూతన విధానాలు, ప్రాజెక్టులు ప్రవేశపెడుతూ పాలనపై తనదైన మార్క్ వేసే బ్రహ్మాండమైన అవకాశాన్ని తన అవగాహనారాహిత్యం, అవకతవక నిర్ణయాలు, ఒంటెత్తు పోకడలు, కక్షపూరిత ప్రవర్తనతో చేజార్చుకున్నారు రేవంత్ రెడ్డి.

మార్పు మార్పు అంటూ ఊదరగొట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన తొలి పూర్తిస్థాయి బడ్జెట్ మీద ప్రజలకు భారీ ఆశలేమీ లేకపోయినా కనీసం గుణాత్మకంగా ఏదైనా మార్పు ఉంటుందేమోనని ఎదురుచూసినవారికి ఈ బడ్జెట్ నిరాశే మిగిల్చింది. ఎంతసేపూ కేసీఆర్ మీద అక్కసుతో తెలంగాణ రాష్ట్ర ప్రతిష్టను దిగజార్చే చౌకబారు ఎత్తుగడలనే కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నమ్ముకున్నట్టు సభలో వారి ప్రవర్తన నిరూపించింది.

ఈసారి చాలామంది తెలంగాణవాదులకు నచ్చింది బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రసంగం. ఆయన సారథ్యంలో గుప్పెడు మంది బీఆర్ఎస్ నాయకులు పాండవుల్లాగా సభలో చర్చను డామినేట్ చేశారు. ముఖ్యంగా రోజురోజుకూ పదునెక్కుతున్న కేటీఆర్ నాయకత్వశైలి ఈ సమావేశాల్లో స్పష్టంగా కనిపించింది. సభలో ఎప్పటికప్పుడు అటు హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి లాంటి సీనియర్లను, ఇటు అనిల్ జాదవ్, పాడి కౌశిక్‌రెడ్డి, డాక్టర్ సంజయ్ వంటి నూతన ఎమ్మెల్యేలనూ సమన్వయపరిచిన తీరు, మహిళా నాయకుల మీద అధికారపక్షపు వెకిలి దాడిని తిప్పికొట్టిన విధానం రాటుదేలుతున్న కేటీఆర్ నాయకత్వశైలికి గీటురాయిగా నిలిచింది. రేవంత్ రెడ్డి 'తాతలు తండ్రుల వారసత్వం' అని ఒక వ్యాఖ్య చేస్తే వెంటనే కేటీఆర్ లేచి 'రాహుల్ గాంధీ, రాజీవ్‌గాంధీ గురించేనా మీ వ్యాఖ్యలు' అంటూ జవాబివ్వడం ప్రజలను ఆకట్టుకున్నది.

ద్రవ్య వినిమయ బిల్లుపై అసెంబ్లీలో జరిగిన చర్చలో కేటీఆర్ తన విశ్వరూపం ప్రదర్శించారంటే అతిశయోక్తి కాబోదు. బడ్జెట్‌లోని డొల్లతనాన్ని ఎత్తిచూపుతూ, రేవంత్ ప్రభుత్వం తీసుకుంటున్న అవకతవక నిర్ణయాలను కేటీఆర్ తూర్పారబట్టారు. కాంగ్రెస్ పార్టీ నాయకులకు కేసీఆర్ ఫోబియా పట్టుకున్నదని, ఆయన ఆనవాళ్లు చెరపడం వారి వల్ల కాదని స్పష్టం చేశారు. 'కాళేశ్వరం మొదలుకొని, పాలమూరు, సీతారామ ప్రాజెక్టుల వరకు, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, గురుకుల బడి నుంచి యాదాద్రి గుడి వరకు, నిరంతర విద్యుత్తు నుంచి మెడికల్ వైద్య విప్లవం వరకు, చివరికి మీరు కూర్చున్న సచివాలయ సౌధపు రాజసంలో ఉన్న కేసీఆర్‌ను.. ఎక్కడ చెరిపేస్తారు? ఎలా చెరిపేస్తారు?' అంటూ కేటీఆర్ సంధించిన శరపరంపర కాంగ్రెస్ సర్కారును ఉక్కిరిబిక్కిరి చేసింది.

అరచేతిలో వైకుంఠం చూపెట్టి అధికారంలోకి వచ్చి, వందరోజుల్లో ఇస్తామన్న ఒక్క కొత్త పథకమూ ఇవ్వకపోగా ఉల్టా రైతుబంధు లాంటి ఇది వరకున్న స్కీములనే ఎత్తివేసిన కాంగ్రెస్ ప్రభుత్వపు మోసాన్ని కూలంకషంగా వివరించిన కేటీఆర్ 'అన్నవస్త్రాల కోసం పోతే ఉన్న వస్త్రాలు పోయినట్టు అయ్యింద'ని అన్నారు. ఉద్యోగాలు ఇవ్వక నిరుద్యోగులను, రైతు భరోసా ఇవ్వక రైతన్నలను, పథకాలు రద్దుచేసి నేతన్నలను.. ఆర్టీసీ ఉద్యోగుల నుంచి ఆటో డ్రైవర్ల వరకు, మహిళల నుంచి పండు ముదుసలి వరకు నమ్మి ఓటేసిన ప్రతీ ఒక్కరినీ మోసం చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీదని విమర్శించారు.

అచ్చ తెలుగులో మాట్లాడుతూ, మధ్యలో తెలంగాణ కవులు రాసిన కవితలు, గేయాలను సందర్భోచితంగా ఉటంకిస్తూ, అధికార పక్షానికి కేటీఆర్ మూడు చెరువుల నీళ్లు తాగించారు. 'ఎన్నికల ముందు రజినీకాంత్, ఎన్నికలైపోయాక గజినీకాంత్, గ్యారంటీలకు టాటా, లంకె బిందెల వేట, ఓట్లకు ముందు అభయహస్తం, ఓట్లు పడ్డాక శూన్య హస్తం' అంటూ ప్రాసలతో, పంచ్‌లతో సాగిన కేటీఆర్ ప్రసంగం, అవసరమైన చోట గణాంకాలతో సోదాహరణంగా ప్రభుత్వ అంకెల గారడీని ఎండగట్టింది.

కాంగ్రెస్ వచ్చాక నేతన్నల దైన్యం గురించి వివరిస్తూ అలిశెట్టి ప్రభాకర్ రాసిన 'బతుకు దారాలు, దారులు తొలిగిపోయినయ్.. ముగ్గులు, మగ్గాలు మూగబోయినయ్.. ఇల్లిల్లు దాటి, సిరిసిల్ల దాటి తొందరగా వెళ్లిపోవే తల్లి దసరా' అనే కవితను కేటీఆర్ చదివి వినిపించారు.

మార్పు తెస్తామని తెలంగాణ ప్రజలను కాంగ్రెస్ ఎట్లా మోసం చేసిందో వివరిస్తూ..
'మార్పు మార్పు అనుచు
పలుమార్లు మార్చి మార్చి
ఏమార్చి పిలిచిన మాత్రాన
మార్పు వచ్చునా తత్వమందు.
గోమారిని పేరు మార్చి
సుకుమారి అని ముద్దుగ
కోరికమేర పిలిచినా
గోవుల నెత్తురు పీల్చకుండునా?'
అంటూ కవి పల్లా దుర్గయ్య పద్యాన్ని కోట్ చేసి ఆకట్టుకున్నారు.

తొలిరోజు హరీశ్‌రావు, మరుసటి రోజు జగదీశ్‌రెడ్డి, మూడోరోజు సబితా ఇంద్రారెడ్డి, నాలుగోరోజు కేటీఆర్.. ఇలా ఒక్కోరోజు ఒక్కో బీఆర్ఎస్ నాయకుడు కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ ఒక బలమైన ప్రతిపక్షం ఉంటే ప్రభుత్వానికి ముకుతాడు ఎలా వేయొచ్చో చూపించారు.

సభలో బీఆర్ఎస్ నాయకులు చేసిన ఎదురుదాడికి కకావికలైన అధికార పార్టీ జవాబు చెప్పలేక చౌకబారు మాటలకు, బూతులకు, బెదిరింపులకు తెగబడింది. సీనియర్ మహిళా శాసనసభ్యులైన సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డిల మీద ఏకంగా ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి అక్కసుతో చేసిన వ్యాఖ్యల మీద సభలోనే కాక రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తాయి. ఒక విధంగా చర్చల్లో బీఆర్ఎస్ పైచేయి సాధించడాన్ని జీర్ణించుకోలేకనే కాంగ్రెస్ నాయకత్వం మహిళా నేతలపై దుర్మార్గపు దాడి చేసిందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. చేసిన తప్పును సమర్థించుకోవడానికి రేవంత్ ప్రభుత్వం పడరాని పాట్లు పడ్డా ఇప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయిందనేది మీడియా, రాజకీయ రంగాల్లో ఇప్పుడు జరుగుతున్న చర్చ.

పాలకులు వస్తుంటారు, పోతుంటారు. పాలకులు మారినా, ప్రభుత్వాలు మారినా అభివృద్ధి, సంక్షేమం అనేవి జోడెడ్లలా ముందుకుసాగాలి. అధికార మార్పిడి జరిగినప్పుడు కొత్తగా కొలువైన ప్రభుత్వం గత సర్కారు చేసిన మంచి పనులను కొనసాగిస్తూనే మరింతగా అభివృద్ధి చేసేందుకు కృషిచేయాలి. అంతేకానీ, ఓటమి పాలైన పార్టీపై అభాండాలు వేస్తూ కాలయాపన చేయడం సమంజసం కాదు.

సాగునీళ్లపై రాజకీయాలా?

జీడిపల్లి రాంరెడ్డి
96666 80051

రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల వేళ దురదృష్టవశాత్తూ కుంగిన మేడిగడ్డ పిల్లర్లనే ప్రచారాస్త్రంగా చేసుకున్న కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. రూ.90 వేల కోట్లతో కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించగా.. లక్ష కోట్ల అవినీతి జరిగిందంటూ కాంగ్రెస్ గల్లీ లీడర్ల నుంచి ఢిల్లీ లీడర్ల దాకా మోత మోగించారు. నిజం గడప దాటకముందే అబద్ధం ఊరంతా చుట్టివచ్చిన చందంగా అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. ఎన్నికలు ముగిశాయి, కొత్త ప్రభుత్వం కొలువైంది. బాధ్యతతో వ్యవహరించాల్సిన కాంగ్రెస్ ప్రభుత్వం అందుకు విరుద్ధంగా కేసీఆర్ సర్కార్‌పై ఇప్పటికీ విషం చిమ్ముతూనే ఉన్నది. వరద వస్తే మేడిగడ్డ కొట్టుకుపోతుందని మొన్నటివరకు కాంగ్రెస్ నేతలు దుష్ప్రచారం చేశారు. కానీ, గోదావరి వరదలను, కాంగ్రెస్ కుట్రలతో కలెబడి మేడిగడ్డ నిలబడ్డది.

ఉమ్మడి ఏపీలో కరువు కాటకాలతో అల్లాడిన తెలంగాణ రైతాం